ఐలమ్మ జీవితం భావితరాలకు ఆదర్శం: కలెక్టర్



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, కొత్వాల

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జీవితం భావితరాలకు ఆదర్శనీయమని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంత్యుత్సవాలను కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా దొరలు, భూస్వాముల నిరంకుశ పాలనపై సాయుధ పోరాటం చేసిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. చేతివృత్తులవారు 'పీఎం విశ్వకర్మ' యోజనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ విద్యాచందన, కలెక్టరేట్ ఏఓ ఎం.రమాదేవి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇ. ఇందిర, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, బీసీ సంఘం నాయకులు ఇంద్రాల దుర్గయ్య, సుంకర అజిత్, నేరెళ్ల రమేశ్, చిటికెన ముసలయ్య, వెంకటాచారి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలకు ఆధునికత జోడించాలి

ములకలపల్లి: నాయకపోడు సంప్రదాయ దేవతామూర్తుల బొమ్మలతో పాటు, ఆధునికతను జోడించి మరిన్నో చెక్క బొమ్మలను తయారు చేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచించారు. మాదారంలో సుమారు రూ.31 లక్షలతో ఏర్పాటు చేసిన నాయకపోడు హస్తకళా వస్తువుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. నాయకపోడు వంశ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. బొమ్మల తయారీకి వినియోగించే మొక్కలను మాదారం పరిసర ప్రాంతాల్లో నాటించాలన్నారు. మార్కెటింగ్ పరిజ్ఞానం పెంచుకుంటూ వ్యాపారాన్ని విస్తరించాలని సూచించారు. చిన్నారుల కోసం ఆట వస్తువులు తయారుచేయాలన్నారు. ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, తహసీల్దార్ పుల్లారావు, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ లక్ష్మయ్య, ఏపీఎం సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16 ఏళ్ల నిరీక్షణకు తెర..!

పాల్వంచ, న్యూస్‌టుడే



కష్టపడి చదివి 2008 డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరి విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. అయితే అనూహ్యంగా కొన్ని అవాంతరాలు ఎదురవటంతో ఉద్యోగంలో చేరలేకపోయారు. బతుకుదెరువు కోసం కొందరు దినసరి కూలీల అవతారమెత్తారు. మరికొందరు ప్రైవేట్ కొలువులు చేసుకుంటున్నారు. ఇంకొందరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. 2008లో నష్టపోయిన డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఏజెన్సీ ప్రాంతంలో 202 మంది, నాన్ ఏజెన్సీ ప్రాంతంలో 128 మందికి ప్రయోజనం కలగనుంది. ఇన్నాళ్లకు తమ శ్రమ ఫలించిందని ఆనందపడుతున్నారు. డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు కాంట్రాక్టు పద్ధతిన కాకుండా రెగ్యులర్ ఉద్యోగులుగా ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ)గా మరికొన్ని రోజుల్లో కొలువు దీరనున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

అప్పట్లోనే ఉపాధ్యాయ కొలువు చేపడతాననుకున్నా

పోలిశెట్టి సాయిరామకృష్ణ, 2008 డీఎస్సీ అభ్యర్థి



మాది భద్రాచలం ఎంపీ కాలనీ. ప్రస్తుతం నాకు 40 ఏళ్లు. 2008లోనే డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాను. అప్పట్లోనే ఉపాధ్యాయ కొలువులో చేరుతానని అనుకున్నా. అయినా ఉద్యోగం రాలేదు. నిరాశ చెందకుండా ఇతర కొలువుపై దృష్టిసారించా. టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్) ఉద్యోగం వచ్చింది. 2024 ఆగస్టు 1 నుంచి పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకులంలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాను. 2008 డీఎస్సీ అభ్యర్థుల విషయంలో సర్కారు తాజా నిర్ణయంతో నాతోటి స్నేహితుల ఆశలు చిగురించాయి.

రెవెన్యూ శాఖలోకి..

గొబ్బ వాసు, 2008 డీఎస్సీ అభ్యర్థి



ఎన్నో కలలు కన్నా. కానీ కొలువు మాత్రం దక్కలేదని మదనపడ్డా. చివరికి ఊరట లభించింది. మాది ఖమ్మం జిల్లా మధిర. నాకు ఇప్పుడు 44 ఏళ్లు. 2012లో వీఆర్ఏగా ఉద్యోగం సాధించా. ప్రస్తుతం మధిర తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నా.

ప్రస్తుతం సీఆర్పీగా పనిచేస్తున్నా..

బాడిసే సంపత్, 2008 డీఎస్సీ అభ్యర్థి



2008 డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించటంతో ఎంతో ఆనందపడ్డా. అనివార్య కారణాలతో ఉద్యోగం దక్కలేదు. నష్టపోయిన వ్యక్తికీ పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి. మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం. ఆర్లగండి గ్రామం. నాకు ఇప్పుడు 43 ఏళ్లు. 2012 నుంచి సమగ్ర శిక్ష విభాగంలో సీఆర్పీగా పనిచేస్తున్నా.



2008 డీఎస్సీలో నష్టపోయిన బీఈడీ అభ్యర్థుల తుది జాబితాపై కసరత్తు చేస్తున్నాం. ప్రస్తుతానికి 128 మంది నాన్ ఏజెన్సీ అభ్యర్థుల జాబితా రూపొందించాం. ఏజెన్సీ అభ్యర్థులపై కసరత్తు కొనసాగుతోంది. అభ్యర్థుల ధ్రువపత్రాలను సోమవారం నుంచి పరిశీలిస్తాం. - సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

మేం.. డిజిటల్ సర్వే చేయలేం..!

చేతులెత్తేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులు

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'డిజిటల్ పంట సర్వే'కు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పంటల సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులకు సర్కారు అప్పగించింది. ఈమేరకు శిక్షణ, యాప్‌లను ఏఈఓలకు అందించింది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మంగళవారం సర్వే ప్రారంభించాల్సి ఉండగా.. పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలతో సర్వే చేయలేమంటూ ఏఈఓలు చేతులెత్తేస్తున్నారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే.. డిజిటల్ సర్వే నిర్వహించటం అసాధ్యమంటున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని చెబుతున్నారు.



ఎందుకీ పంట సర్వే..?

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆహారభద్రత, పంటల బీమాతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయటం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ తదితరాలకు డిజిటల్ పంట సర్వే ముఖ్యభూమిక పోషించనుంది. ఇందులో భాగంగా వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. దీని అమలుకు రూ. 2,817కోట్లు వెచ్చిస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చటానికి, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచటానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈకార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో 1,000-1,500 ఎకరాల వరకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని అక్కడి ప్రభుత్వం నియమించింది. గ్రామస్థాయిలో వివిధ వ్యవసాయ సర్వేలు, ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులైన రైతులను గుర్తించటం, ధ్రువపత్రాల సేకరణ, రైతు సమావేశాల నిర్వహణ వంటి విధులు నిర్వర్తించటంతో వ్యవసాయ విస్తరణ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యాయి. మహారాష్ట్ర, ఒడిశాలో టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీలకు డిజిటల్ పంట సర్వే బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకలో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సర్వే చేయిస్తున్నారు. తమిళనాడులో వ్యవసాయ విద్యనభ్యసించిన వారిని రోజూవారీ వేతనంతో పనిచేయించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేయటానికి సిద్ధమని ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, సురేశ్‌రెడ్డి చెబుతున్నారు.

సిబ్బంది కొరతే సమస్య

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 196 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓలు) పనిచేస్తున్నారు. వీరి పరిధిలో సుమారు 11.56 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి 5వేల ఎకరాలకు ఒకరి చొప్పున 232 మంది ఏఈఓలు అవసరం. ఉభయ జిల్లాల్లో దాదాపు 50 శాతం క్లస్టర్లలో సాగు భూమి 5వేల ఎకరాలకు మించి ఉంది. ఇల్లెందు మండలం కొమురారం క్లస్టర్‌లో ఒక్క ఏఈఓ పరిధిలో సుమారు 29వేల ఎకరాల సాగు భూమి ఉండటం గమనార్హం. డిజిటల్ సర్వేలో భాగంగా సదరు ఏఈఓలు తమ పరిధిలోని అన్ని పంట పొలాల్లోని సర్వే నంబర్లలోకి వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.

ఉత్సాహంగా జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కొత్తగూడెం ప్రకాశం మైదానంలో పాఠశాలల జిల్లాస్థాయి క్రీడా పోటీలు గురువారం మొదలయ్యాయి. ప్రారంభోత్సవంలో భాగంగా డీఈవో వెంకటేశ్వరాచారి, డీవైఎస్‌వో పరంధామరెడ్డి, పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి వాసిరెడ్డి నరేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తదితరులు జ్యోతిని వెలిగించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. తొలిరోజు అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం అండర్-14 విభాగం వారికి పోటీలుంటాయి. ఎనిమిది జోన్ల నుంచి హాజరైన వెయ్యి మంది విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కవ్వింపా.. యుద్ధానికి సన్నద్ధమా..?



చర్ల, న్యూస్‌టుడే

ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుగుప్ప సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపుపై మావోయిస్టులు అనూహ్యంగా కాల్పులకు తెగబడటం కలకలం రేపింది. బుధవారం రాత్రి 7 గంటల నుంచి మావోయిస్టుల కాల్పులు మొదలవటంతో క్యాంపులోని భద్రతా బలగాలు అప్రమత్తమై దీటుగా బదులిచ్చాయి. ఈఘటనపై కేసు నమోదు చేశామన్న సీఐ రాజువర్మ.. అరగంట పాటు కాల్పులు జరిగాయని వెల్లడించారు. మావోయిస్టులు బీజీఎల్(బ్యారెల్ గ్రేనేడ్ లాంచర్)లను వినియోగించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. చుట్టుపక్కల సెర్చింగ్ ఆపరేషన్ సాగుతోందని తెలిపారు. పూసుగుప్ప ఘటన నేపథ్యంలో భద్రాద్రి మన్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి తెలంగాణకు వచ్చేవారిని నిశితంగా తనిఖీ చేస్తున్నారు. బాంబ్‌స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. కేంద్ర పారామిలిటరీ బలగాలు చర్ల నుంచి పూసుగుప్ప రహదారి వెంట ఆర్‌వోపీ(రోడ్ ఓపెనింగ్ పార్టీ) బృందంతో క్షుణ్ణంగా తనిఖీలు సాగిస్తున్నాయి. పూసుగుప్ప బేస్ క్యాంపు చుట్టుపక్కల అటవీ ప్రాంతాన్ని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. భద్రతా బలగాలు వస్తాయనే అంచనాతో మావోయిస్టులు అడవుల్లో ఐఈడీ(ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్)లను పెట్టారనే అనుమానంతో బీడీఎస్ బృందాలను రంగంలోకి దించారు.

భద్రాద్రి ఏజెన్సీలో అప్రమత్తం

కొద్దిరోజులుగా ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టుల కోటలో భద్రతా బలగాలు పాగా వేస్తున్నాయి. నక్సల్స్ ప్రభావిత దండకారణ్యంలో బేస్‌క్యాంపుల ఏర్పాటు శరవేగంగా సాగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ కీలక స్థావరాల్లో బేస్ క్యాంపుల ఏర్పాటుకు అడ్డుకట్ట వేయాలనే వ్యూహంతో మావోయిస్టులు పూసుగుప్ప బేస్ క్యాంపుపై కాల్పులకు పాల్పడి ఉంటారని నిఘావర్గాలు భావిస్తున్నాయి. ఓపక్క ఈనెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు ఆవిర్భావ ఉత్సవాలకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. దండకారణ్యంలో ఉత్సవాలు జరుపుకొంటున్న తరుణంలో తెలంగాణలో పూసుగుప్ప క్యాంపుపై దాడికి పాల్పడటంలో ఆంతర్యమేంటో అంతుచిక్కటం లేదు. దండకారణ్యంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల నడుమ ప్రచ్ఛన్నయుద్ధం సాగుతోంది. ఈసమయంలో ఇంత నిర్బంధంలోనూ మావోయిస్టులు తెలంగాణ సరిహద్దులోని పూసుగుప్ప బేస్ క్యాంపు సమీపానికి వచ్చి దాడికి ఒడిగట్టడమంటే పోలీసులకు సవాల్ విసిరినట్టే.

ఈ ఏడాది జనవరి 16న ఛత్తీస్‌గఢ్‌లోని ధర్మారం, చింతవాగు, పామేడు బేస్ క్యాంపులపై మావోయిస్టులు ఏకకాలంలో భీకరదాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు పది గంటలకు పైగా జరిగిన దాడులను భద్రతా బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. నక్సల్స్ వ్యూహాత్మక దాడి తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు అనుక్షణం అప్రమత్తంగా అడుగులు వేస్తున్నాయి. తాజాగా పూసుగుప్ప బేస్ క్యాంపుపై జరిపిన దాడిలో బీజీఎల్‌లను మావోయిస్టులు వినియోగించారు. దాడి వెనుక ఆంతర్యం తెలియకపోయినా భవిష్యత్తులో యుద్ధానికి దీనిని సన్నద్ధంగా భావిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దాడికి ఛత్తీస్‌గఢ్‌లో యుద్ధతంత్రంలో నిష్ణాతులైన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ) నేతృత్వం వహించినట్లు తెలుస్తోంది. పూసుగుప్ప ఘటనపై ఎస్పీ రోహిత్‌రాజు ఆరాతీశారు. భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వార్‌తో పాటు సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. సరిహద్దు బేస్ క్యాంపులకు అదనపు బలగాలు రప్పిస్తున్నారు.



చర్ల- పూసుగుప్ప రహదారిపై సీఐ రాజువర్మ నేతృత్వంలో తనిఖీలు

బోడు రోడ్డు కూడలి విస్తరణ పరిధి తగ్గించండి: కోరం



హైవే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 930-పీ) విస్తరణలో భాగంగా టేకులపల్లి మండల కేంద్రం బోడు రోడ్డు వద్ద హై జంక్షన్ ఏర్పాటు కానుంది. బోడు రోడ్డుకు ఎడమ వైపున్న పది నివాసాలు తొలగించాల్సి రావడంతో.. బాధితులు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. ఎన్‌హెచ్ అధికారులతో కోరం మాట్లాడటంతో ఈఈ యుగంధర్, డీఈ శైలజ టేకులపల్లికి గురువారం వచ్చారు. ఎమ్మెల్యేతో కలిసి హై జంక్షన్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. జాతీయ రహదారికి ఏమాత్రం సంబంధం లేనివారు నిరాశ్రయులుగా మారే ప్రమాదముందని ఎమ్మెల్యే తెలిపారు. విస్తరణ పరిధి తగ్గించి నష్టపోకుండా చూడాలన్నారు. కోయగూడెం ఓసీతో ఎదురయ్యే ట్రాఫిక్ సమస్య శాశ్వతం కాదని, అటవీ గ్రామాలున్నందున జంక్షన్ అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేయాలని సూచించారు.

పామాయిల్ కర్మాగారాన్ని పరిశీలించిన మలేషియా ఇంజినీర్లు

దమ్మపేట: అప్పారావుపేట పామాయిల్ కర్మాగారాన్ని మలేషియాకు చెందిన వై.కె.ఎల్. కంపెనీ ఇంజినీర్లు మైఖేల్‌వాంగ్, వెన్ హోలింగ్ గురువారం సందర్శించారు. సాంకేతికత పెరిగితే ఆయిల్ రికవరీ శాతం మెరుగుపడే అవకాశం ఉందని తెలిపారు. ఆయిల్‌ఫెడ్ సాంకేతిక విభాగం మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సత్యనారాయణ, కర్మాగార మేనేజర్ కల్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయ నిత్య పూజలపై ప్రచారం

భద్రాచలం: భద్రాచలం రామాలయంలో నిత్య పూజలపై ప్రచారానికి పూనుకున్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో మైకులను అమర్చే ప్రక్రియను ఈఓ రమాదేవి గురువారం ప్రారంభించారు. దాతల సాయం రూ.4 లక్షలతో 50 మైకులు అమర్చనున్నారు. రోజూ ఉదయం సుప్రభాతం సేవ నుంచి ఆలయం మూసే తరుణంలో నిర్వహించే పవళింపు సేవ వరకు ఈ మైకుల గుండా ప్రధాన వీధుల్లో వినే అవకాశం లభించింది. నిత్య కల్యాణ క్రతువుతో పాటు ఇతర ఉత్సవాల ప్రాశస్త్యాన్ని వీటిలో వినిపిస్తారు.

మొర్రేడు ఉప్పొంగితే.. వెన్నులో వణుకే

చుంచుపల్లి, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం మీదుగా ప్రవహించే మొర్రేడు వాగు భారీ వర్షాలప్పుడు పలు కాలనీలను వరదతో ముంచెత్తుతోంది. లక్ష్మీదేవి మండలం పరిధిలోని పలు పంచాయతీలను ఆనుకుని వాగు ప్రవాహం ఉద్ధృతిగా ముందుకు సాగుతోంది. భారీ వర్షాలకు ఏటా పదుల సంఖ్యలో ఇళ్లు ముంపునకు గురై తీవ్ర ఆస్తినష్టం వాటిల్లుతోంది. రక్షణగా గేబియన్ రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

2022 జూన్ నెలలో.. మొర్రేడు వాగుకు వరద పోటెత్తింది. సంజయ్‌నగర్ పంచాయతీ వాగుకు ఆనుకొని ఉన్న ఉపేంద్రకాలనీలో పదుల సంఖ్యలో గృహాలు ముంపునకు గురయ్యాయి. ఇక్కడ ఇప్పటి వరకు 20 ఇళ్లు నివాసానికి పనికిరాకుండా దెబ్బతిన్నాయని బాధితులు చెబుతున్నారు. ప్రశాంతినగర్ పంచాయతీ పరిధిలోని ఓ పాఠశాల భవనం సైతం బాగా దెబ్బతింది. గతేడాది సంజయ్‌నగర్, ప్రశాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో ఏడు ఇళ్లు పూర్తిగా ధ్వంసమవగా, మరో 15 వరకు వాగువైపు వెనుక భాగం గోడలు కూలాయి. ముందు వైపు నిర్మాణాలే మిగిలాయి. పలువురు బాధితులు భయంతో సొంత ఇళ్లను వదిలేసి అద్దె గృహాల్లోకి మారారు. ఇప్పుడక్కడ నివసించే వారు సైతం భారీ వర్షాలొస్తే బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో లక్ష్మీదేవిపల్లి మండలంలో వాగు పరీవాహక ప్రాంతాల రక్షణకు గేబియన్ రిటైనింగ్ వాల్ నిర్మించాలని గతేడాది అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ప్రతిపాదనతో సీఎం కేసీఆర్ ద్వారా రూ.33 కోట్లు మంజూరయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులను వనమా ప్రారంభించారు. ఆ తర్వాత ఎలాంటి ముందడుగు పడలేదని అధికార యంత్రాంగం చెబుతోంది. వాగుకు రెండువైపులా రివిట్‌మెంట్ వాల్, కరకట్ట నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వివిధ సందర్భాల్లో అధికారులతో మాట్లాడి, రక్షణ గోడ నిర్మాణంపై కొత్తగా మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. వాటిని ప్రభుత్వానికి పంపించారు.



గత ఏడాది మొర్రేడు వాగు వరద ప్రవాహంతో కోతకు గురైన ఉపేంద్రకాలనీలోని ఇల్లు

మొర్రేడు పరీవాహక ప్రాంతం రక్షణకు కాంక్రీట్ గోడ నిర్మిస్తే చాలదు. దీనికి బదులుగా గేబియన్ వాల్స్‌ను ఆధునిక పద్ధతిలో రెండువైపులా నిర్మించాల్సి ఉంది. డిసెంబరులో కొత్త ప్రతిపాదనలు పంపించాం. మోడల్ డ్రాయింగ్‌తో అంచనా వేసి పంపాలని ఇటీవల ఈఎన్సీ ఆదేశించారు. దాన్ని సిద్ధం చేస్తున్నాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. - రాంబాబు, డీఈ, నీటిపారుదలశాఖ

రూ.25 లక్షల ఇల్లు కొట్టుకుపోయింది

ఐ.ఉదయ్‌భాస్కర్



ఉపేంద్రకాలనీలో 40 ఏళ్లుగా నివాసం ఉండేవాళ్లం. రూ.25 లక్షలతో నిర్మించుకున్న ఇల్లు రెండేళ్ల క్రితం వచ్చిన మొర్రేడు వరదలకు కొట్టుకుపోయింది. ప్రస్తుతం లక్ష్మీదేవిపల్లిలో అద్దెకుంటున్నాం. ప్రభుత్వ పరిహారం నేటికీ రాలేదు. వెంటనే రక్షణ గోడ నిర్మించాలి.

రాత్రిపూట జాగారమే..: రుక్మిణి, బాధితురాలు



ఇటీవల భారీ వర్షాలు వచ్చినప్పుడు ఏ రాత్రి వరద ముంచెత్తుతుందోనని భయందోళన చెందాం. కొద్ది రోజులు ఇల్లు ఖాళీ చేసి వెళ్లాం. వానొస్తే రాత్రంతా పిల్లలతో కలిసి జాగారం చేయాల్సి వస్తోంది. రక్షణ గోడ నిర్మించకుంటే కాలనీ మొత్తం కోతకు గురవుతుంది.

ప్రతిపాదనలకు మంత్రి ఆమోదం

కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే



మొర్రేడువాగు రక్షణ నిర్మాణానికి నీటి పారుదల శాఖ రూ.35 కోట్లతో ప్రతిపాదనలను పంపించింది. ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే ఆమోదం తెలిపారు. సాంకేతికపరమైన అనుమతి రావాల్సి ఉంది. త్వరలో నిధులు మంజూరవుతాయి. ఆ వెంటనే పనులు ప్రారంభమవుతాయి.

వేదన మిగిల్చిన నైరుతి

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, కల్లూరు


వరద ఉద్ధృతికి కల్లూరు మండలంలో దెబ్బతిన్న రోడ్డు (పాత చిత్రం)

ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వాసులకు నైరుతి రుతుపవనాలు వేదన మిగిల్చాయి. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి ఇప్పటివరకు కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. ఆగస్టు రెండో వారం వరకు మోస్తారు వర్షపాతం నమోదైనా.. ఆతర్వాత తుపాను ప్రభావంతో కుండపోత వానల వల్ల ఉభయ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించగా.. అదేనెల 15 నుంచి పూర్తిస్థాయిలో విస్తరించాయి. ఈనెలాఖరున నిష్క్రమిస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈసారి కురిసిన వర్షాలకు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఉభయ జిల్లాల్లో పదుల సంఖ్యలో కాలనీలు జలమయమయ్యాయి. రహదారులు, కల్వర్టులు, వంతెనలు దెబ్బతినగా.. వేలాది ఎకరాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి అన్నదాతలకు కడగండ్లు మిగిల్చాయి.

భారీ నుంచి అతిభారీ వర్షపాతం నమోదైన ప్రాంతాలు (మి.మీ.లలో)

◆ మండలం	◆ సాధారణ వర్షపాతం	◆ వాస్తవంగా కురిసింది
తిరుమలాయపాలెం	735.7	1,176.2
కల్లూరు	831.9	1,337.0
వేంసూరు	810.3	1,489.7
మధిర	701.9	1,185.6
మణుగూరు	1059.3	1,698.4
ఆళ్లపల్లి	845.7	1,405.3

ఘొల్లుమన్న ఖమ్మం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు నమోదయ్యాయి. జిల్లాలో వానాకాలంలో సాధారణ వర్షపాతం 783.8 మిల్లీమీటర్లు కాగా.. 1,128.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. తిరుమలాయపాలెం, కల్లూరు, వేంసూరు, మధిర ప్రాంతాల్లో 60శాతానికి పైగా అధికంగా వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా ఏన్కూర్ మినహా మిగతా మండలాల్లో మిగులు వర్షపాతం నమోదైంది. ప్రధానంగా ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు ఆకేరు, మున్నేరు నదులు పొంగటంతో అనేక ప్రాంతాల్లో సాధారణ ప్రజలు, అన్నదాతలతో పాటు ప్రభుత్వ ఆస్తులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రాణనష్టమూ సంభవించింది.

మునిగిన మణుగూరు.. తెగిన పెద్దవాగు

ఖమ్మం జిల్లాతో పోల్చితే నైరుతి రుతుపవనాల ప్రభావం భద్రాద్రి జిల్లాలో తక్కువైనప్పటికీ కొన్నిచోట్ల కురిసిన భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జులైలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో గుమ్మడివల్లి, తుపాను ప్రభావం వల్ల మణుగూరు, బుగ్గవాగు పొంగటంతో ఇల్లెందులోని కొన్ని కాలనీల్లోకి వరదనీరు చేరి ప్రజలు నిరాశ్రయులయ్యారు. భద్రాద్రి జిల్లాలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం 947 మిల్లీమీటర్లు కాగా.. 1,240.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రధానంగా మణుగూరు, ఆళ్లపల్లిలో సాధారణం కంటే 60 శాతానికి పైగా వర్షం కురిసింది. 23 మండలాల్లో పదకొండు మండలాల్లో సాధారణ, 10 మండలాల్లో మిగులు వర్షపాతం నమోదైంది.

రోడ్లు ధ్వంసం.. ఒళ్లు హూనం..!


సదాశివునిపాలెం శివారులో సా..గుతున్న వంతెన నిర్మాణ పనులు

ఇటీవల కురిసిన భారీ వర్షాల ధాటికి కొన్నిచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. కల్వర్టులు ధ్వంసమయ్యాయి. అయితే వీటికి మరమ్మతులు చేపట్టకపోవటం వల్ల రాకపోకల సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్నిచోట్ల ఇతరత్రా పనుల కోసం రోడ్లను తవ్వి వదిలేశారు. అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులకు పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈనాడు టాస్క్‌ఫోర్స్

నత్త నడకే నయం

సత్తుపల్లి నుంచి వేంసూరు మండలం వెంకటాపురం వరకు సుమారు 13 కిలోమీటర్ల మేర రోడ్డుతోపాటు సదాశివునిపాలెం శివారులో వంతెన నిర్మాణ పనులకు గతేడాది ఏప్రిల్‌లో రూ.27 కోట్లు మంజూరయ్యాయి. నాలుగు కానాల్లో ప్రారంభించిన వంతెన పనులు వర్షం కారణంగా అంతంతమాత్రంగా సాగుతున్నాయి. రాకపోకల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు మట్టి రోడ్డుకు గండి పడటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గండిని అధికారులు పూడ్చించడంతో రాకపోకలు సాగుతున్నాయి.. ప్రయాణికులకు ఇబ్బందులు మాత్రం తప్పటం లేదు. ఈఅంశంపై ఆర్‌అండ్‌బీ జేఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా పనుల్లో జాప్యం నెలకొందని, జనవరిలోగా పనులన్నీ పూర్తిచేస్తామన్నారు.

– సత్తుపల్లి, న్యూస్‌టుడే


అశ్వారావుపేటలో..

16 నెలలుగా అదే సమస్య

రూ.13.50 కోట్లతో రహదారి విస్తరించారు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, మురుగు కాల్వలు నిర్మించాలని అశ్వారావుపేటలో అయ్యర్ హోటల్ నుంచి సంతపాకల వరకు రోడ్డు పక్కన తవ్వారు. సగం తవ్వాక మంచినీటి పైపులైన్ మార్చేందుకు నిధులు కావాలంటూ పనులను నిలిపేశారు. రోడ్డుపైనే వాహనాలు నిలపాల్సి రావటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. 16 నెలలుగా ఈ సమస్య వేధిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈఅంశంపై ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ తవ్విన చోట రోజుల్లో చదును చేయిస్తామన్నారు.

– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

తవ్వారు.. వదిలేశారు..!


పాలేరులో కేబుల్ ఏర్పాటు కోసం తవ్విన కాల్వలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం (పాత చిత్రం)

సూర్యాపేట- ఖమ్మం ప్రధాన రహదారి వారగా ఓ ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీ కేబుల్ ఏర్పాటు కోసం తవ్వకాలు జరుగుతున్నాయి. పాలేరు గ్రామం వద్ద చేపట్టిన పనుల్లో జాప్యం కారణంగా వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదే గ్రామంలో జుజ్జులరావుపేట, నర్సింహులగూడెం గ్రామాలకు వెళ్లే రహదారి కలవడంతో తవ్వి వదిలేసిన గోతుల్లో ఇటీవల ఓ ద్విచక్రవాహనం దూసుకెళ్లటంతో చోదకుడు తీవ్రంగా గాయపడ్డారు. వాహనం దెబ్బతింది. మరో చోట రెండు గేదెలు జారిపడి గాయాలపాలయ్యాయి. సదరు కేబుల్ నిర్వాహకులతో మాట్లాడి పనులు వేగవంతమయ్యేలా చూస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ దేవేందర్ తెలిపారు.

– కూసుమంచి, న్యూస్‌టుడే

కల్వర్టు తొలగింపుతో ఇక్కట్లు

భద్రాచలం శివారులోని జగదీశ్‌కాలనీ నుంచి రామాపేటకాలనీకి వెళ్లే మార్గంలో కల్వర్టును తొలగించారు. దాదాపు నెల నుంచి ఈమార్గం గుండా నడవటానికి వీల్లేకుండా పోయింది. రామాలయ చెరువు నీరు ఈ కల్వర్టు గుండా ప్రధాన డ్రెయిన్‌లో కలుస్తుండేది. గత నెలలో వచ్చిన వర్షానికి మురుగునీరు పొంగిపొర్లటంతో చుట్టుపక్కల ఇళ్లలోకి వరద నీరు చేరింది. సమస్య తీవ్రతను తగ్గించేందుకు కల్వర్టును తొలగించారు. మళ్లీ దీన్ని నిర్మించకపోవటంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. రూ.50వేలు ఖర్చు పెడితే ఇది బాగవుతుంది. త్వరలోనే దీన్ని పునర్నిర్మిస్తామని గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.


భద్రాచలం జగదీశ్ కాలనీలో రోడ్డును తవ్వి వదిలేశారిలా..

– భద్రాచలం, న్యూస్‌టుడే

‘మీ చెంతకే భవిష్యనిధి’ నేడు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ‘మీ చెంతకే భవిష్య నిధి(నిధి ఆప్‌కే నికట్)’ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అధికారులు రబీలాల్ దాస్, కె.సునీల్ తెలిపారు. ఖమ్మం జిల్లావాసులు మధిర పంచాయతీ కార్యాలయం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు కొత్తగూడెం పట్టణంలోని త్రివేణి హైస్కూల్లో ఉదయం 9 గంటలకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు దారుణానికి ఒడిగట్టారు. బెజ్జీ పోలీసుస్టేషన్ పరిధిలోని భండార్ పదర్ గ్రామానికి చెందిన సోయం పాండు(53) అనే వ్యక్తిని ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న పాండును బుధవారం రాత్రి మావోయిస్టు పదునైన ఆయుధంతో హత్య చేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకుని గర్భవతిని చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆళ్లపల్లి ఎస్సై రతీశ్ తెలిపారు. స్థానిక పోలీసు ఠాణాలో గురువారం ఎస్సై వివరాలు వెల్లడించారు. ఇల్లెందు పట్టణానికి చెందిన ఓ బాలిక(మైనర్) ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటోంది. ఆ బాలిక బంధువులైన ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన దారం కార్తీక్‌తో కొంతకాలం ప్రేమలో ఉన్నట్లు తెలిపారు. బాలికను శారీరకంగా లోబర్చుకోవడంతో గర్భవతి అయినట్లు పేర్కొన్నారు. కొన్ని రోజు తర్వాత బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. ఆళ్లపల్లి పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

డైరెక్టర్ (ఈ,ఎం) పదవీ కాలం పొడిగింపు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: డైరెక్టర్ (ఎలక్ట్రికల్, మెకానికల్) డి.సత్యనారాయణరావును డైరెక్టర్‌గా మరో 11 నెలల 6 రోజులు పొడిగిస్తూ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఉద్యోగ విరమణ చేయనున్న వచ్చే సంవత్సరం ఆగస్టు 31 దాకా డైరెక్టర్(ఈ,ఎం)గా కొనసాగించనున్నారు. గురువారం పలువురు అధికారులు సత్యనారాయణరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎం జక్కం రమేష్, అధికారులు దిలీప్‌కుమార్, మనోజ్‌కుమార్, మీనాజుద్దీన్, కార్తీక్‌శర్మ, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు రోగులకు ఏకకాలంలో..

థైరాయిడ్ గ్రంథుల తొలగింపు


శస్త్ర చికిత్సలు చేస్తున్న వైద్యులు

కొత్తగూడెం వైద్యవిభాగం: సర్వజన ఆసుపత్రిలో ఒకేసారి ఇద్దరు రోగులకు సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్యులు గురువారం నిర్వహించారు. ఇల్లెందుకు చెందిన గుడిపెల్లి శశికళ (36) థైరాయిడ్‌తో బాధపడుతోంది. గొంతు భాగం వాపెక్కి ఇబ్బంది పడుతున్న ఆమెకు క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని వైద్యులు గుర్తించారు. మణుగూరు సుందరయ్యనగర్ కాలనీకి చెందిన ఐనాల రవి (52) ఇదే సమస్యతో బాధపడుతున్నాడు. వీరిద్దరికీ ఏకకాలంలో శస్త్రచికిత్స చేసి గ్రంథులను తొలగించారు. వైద్య బృందంలో జనరల్ సర్జన్ నవ్యదీప్, ఈఎన్‌టీ సర్జన్ శాంసన్ (హెచ్‌ఓడీ ప్రొఫెసర్), అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి, మత్తు వైద్యనిపుణులు రమేశ్, రాము, ఉన్నారు.

తండ్రి దస్త్రాలు ఇచ్చి వస్తూ.. అనంత లోకానికి


షారూఖ్

ఎర్రుపాలెం, మధిర: తండ్రి కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. తాను చేస్తున్న ఉద్యోగానికి ఐచ్ఛిక విరమణ చేయాలని నిర్ణయించుకున్నారు. దీనికి సంబంధించిన దస్త్రాలన్నీ సిద్ధంచేసి తండ్రి పనిచేసే పాఠశాలలో ఇచ్చి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మధిరలోని చెరుకుమల్లి వారి వీధిలో నివాసం ఉండే షేక్ గౌస్ మడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో యూడీసీగా పనిచేస్తూ ఎర్రుపాలెం మండలం మీనవోలు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఇటీవల బదిలీ అయ్యారు. ఇతను మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లో ఆగస్టులో శస్త్రచికిత్స చేశారు. మంచానికే పరిమితమైన గౌస్ ఐచ్ఛిక ఉద్యోగ విరమణకు అనుమతివ్వాలంటూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి దస్త్రాలు, మెడికల్ బిల్లులను మీనవోలు పాఠశాలలో ఇచ్చేందుకు కుమారుడు షారూఖ్ గురువారం బైక్‌పై వెళ్లాడు. వాటిని పాఠశాలలో అప్పగించిన అనంతరం తిరిగొస్తుండగా అదే గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. షారూఖ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ సోదరి ఉన్నారు. తల్లి బేగం విద్యుత్తు సంస్థలో ఉద్యోగిగా మధిరలో పనిచేస్తున్నారు. ఓవైపు భర్త అనారోగ్యం, చేతికందిన కుమారుడు మృతిచెందటంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గడ్డి పొదల్లో గంజాయి పొట్లాలు



సుజాతనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రీయ రహదారి పక్కన గడ్డి పొదల్లో గంజాయి పొట్లాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేపలగడ్డ ఆర్వోబీ వంతెన సమీపంలో రోడ్డు పనులు నిర్వహిస్తున్న కూలీలు.. అక్కడున్న గడ్డి పొదల్లో చేతి సంచి, బంతుల ఆకారంలో ప్యాకింగ్ చేసిన పొట్లాలను గమనించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఇంటి యజమాని ఒకరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై జుబేదాబేగం వెళ్లి తనిఖీలు చేయగా సంచుల్లో 5 కిలోల గంజాయి లభ్యమైంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి తరలించే క్రమంలో.. స్థానికంగా చేపట్టిన తనిఖీలకు భయపడి నిందితులు సంచులను పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేశారు.

ఉద్యోగాల పేరుతో వంచన?

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన సంఘటన ఖమ్మం నగరంలో తాజాగా వెలుగు చూసింది. డబ్బు చెల్లించి, ఉద్యోగం రాక కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితుల్లో కొందరు ఖానాపురం హవేలి పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యక్తి, భద్రాచలానికి చెందిన ఓ మహిళతో కలిసి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను నమ్మించారు. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.3 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన నగరానికి చెందిన ఇద్దరు నిరుద్యోగులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది. మోసపోయిన నిరుద్యోగుల సంఖ్య భారీగా ఉందని, వారు కూడా పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనిపై ఖానాపురం హవేలి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్‌ను సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని, వెంటనే తమను సంప్రదించాలని సూచించారు.

నాడు చెత్తకుప్పల వెంట.. నేడు ఆత్మీయుల చెంత





కుటుంబ సభ్యులతో నాగేశ్వరరావు (మెడలో కండువా ఉన్న వ్యక్తి)

ఈ ఏడాది జనవరి నెల.. నేలకొండపల్లి మండల కేంద్రంలో రోడ్ల వెంట ఓ వ్యక్తి సంచరించేవాడు. మతిస్థిమితంలేని అతను బైపాస్ వంతెనకింద నిద్రించేవాడు. రాత్రి వేళల్లో అటుగా వెళ్లే వారు ఏమైనా ఇస్తే తినేవాడు. లేకుంటే పస్తులుండేవాడు. తర్వాత అతని జాడలేదు. ఈ నేపథ్యంలో కొన్ని నెలల తర్వాత గురువారం నేలకొండపల్లిలో మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. కానీ రూపం మారింది. శుభ్రమైన దుస్తులతో తేటతెల్లంగా దర్శనమిచ్చాడు. గతం గురించి నోరువిప్పాడు. అతను, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం వట్టిదేపమానిపల్లె గ్రామానికి చెందిన జెర్రిపోతుల నాగేశ్వరరావు.. నలుగురు సిబ్బందికి జీతాలిస్తూ, రోజూ 400 లీటర్ల పాలను విక్రయించే స్థితిలో ఉండేవారు. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమై ఇల్లు వదిలివెళ్లాడు. మతిస్థిమితం కోల్పోయి నేలకొండపల్లి చేరుకున్నాడు. రెండు, మూడు నెలలుగా ఇక్కడే ఉంటున్నట్లు గమనించి స్థానికులు ఖమ్మంలోని అన్నం సేవా ఆశ్రమానికి సమాచారం అందించారు. అన్నం అతణ్ని చేరదీసి సపర్యలు చేశారు. చికిత్స ద్వారా మామూలు మనిషిగా మార్చారు. పేరు, వివరాలు కనుక్కుని అక్కడి పోలీసుల సహకారంతో కుటుంబ సభ్యులను రప్పించారు. ఏడాదిన్నర అన్వేషన అనంతరం కనిపించిన తమ మనిషిని చూసి కుటుంబ సభ్యులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. నేలకొండపల్లి ప్రధాన కూడలిలో ఏఎస్ఐ కోడెత్రాచు, రెవెన్యూ అధికారుల సమక్షంలో అన్నం.. నాగేశ్వరరావును కుటుంబీకులకు అప్పగించారు. అన్నంను స్థానికులు అభినందించారు.

– నేలకొండపల్లి, న్యూస్‌టుడే

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


రాము

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన నిలబడి మాట్లాడుతున్న వారిని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స కోసం తరలిస్తుండగా మరణించాడు. గురువారం తెల్లవారుజామున త్రీ ఇంక్లైన్ రేడియో స్టేషన్ వద్ద చోటుచేసుకున్న సంఘటన వివరాలు రెండో పట్టణ పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. సింగరేణి ప్రధాన ఆసుపత్రి ఏరియా గౌతంనగర్ కాలనీకి చెందిన మిద్దె రాము (45) ఆసుపత్రి ఏరియాలో హోటల్ నిర్వహిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి దాటాక ఇసుక ట్రాక్టర్‌తో పాటు రేడియో స్టేషన్ వద్దకు వెళ్లారు. అక్కడ ఇసుక డంప్ అనంతరం కిరాయి విషయమై ట్రాక్టర్ డ్రైవర్, కొనుగోలుదారుతో మాట్లాడుతుండగా.. అదే సమయంలో నూజివీడు నుంచి రాయ్‌పూర్‌కి చేపల మేత లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ ట్రాక్టర్‌ను, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్, బాడీ మధ్య రాము ఇరుక్కుపోయాడు. కాలు విరిగి, తలకు తీవ్రగాయాలయ్యాయి. అతణ్ని అక్కడున్నవారు కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని సూచించారు. ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో రాము మరణించారు. ఆయనకు భార్య, బీటెక్, ఇంటర్ చదివే ఇద్దరు కుమారులున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ కిందకు దూకడంతో స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అతివేగంతో ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ నాగుల్‌మీరాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బావిలో పడి వృద్ధుడు..


కృష్ణ

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణం పుల్లయబంజరు రోడ్డులో నివాసముంటున్న నన్నా కృష్ణ (73) అనే వృద్ధుడు బావిలో పడి మృతి చెందాడు. మతిస్థిమితం లేని అతను బుధవారం ఇంటినుంచి వెళ్లిపోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం సమీపంలోని బావిలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వాసుపత్రికి పంపారు. భార్య బ్రహ్మానందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షాకీర్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కరకగూడెం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కరకగూడెం పోలీస్ ఠాణాలో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరకగూడెం మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని(17) భద్రాచలం కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె కళాశాలకు వెళ్లడం లేదు. దీంతో తల్లి కళాశాలకు వెళ్లాలని మందలించడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

ఉరి వేసుకుని యువతి..

తల్లాడ, న్యూస్‌టుడే: నూతనకల్ గ్రామానికి చెందిన ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పదో తరగతి వరకూ చదువుకున్న చలమల అనూష(20) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి..


రాజు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: అప్పుల బాధ, ఒత్తిళ్లు లేక ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజులరాజం బస్తీలో గురువారం చోటుచేసుకుంది. మూడవ పట్టణ పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జీఆర్‌బస్తీకి చెందిన వడ్లకొండ రాజు (37) కొత్తగూడెం ఓ ప్రైవేటు బ్యాంకులో క్రెడిట్‌కార్డు కలెక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో పాటు అప్పులు పెరిగిపోవడంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన రాసిన ఆత్మహత్య లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భార్య నాగప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడికి రెండేళ్ల బాబు ఉన్నాడు.

కొత్తది కొట్టుకుపాయె.. పాత వంతెనే దిక్కాయె


ఆకేరు లోలెవల్ వంతెనపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు


కస్నాతండాలో ఆనవాళ్లు కోల్పోయిన పంట పొలాలు


రాళ్లూరప్పల మధ్య పొలం పనికి నాగలితో వెళ్తున్న రైతు

ఖమ్మం- మహబూబాబాద్ జిల్లాల సరిహద్దులో ప్రధాన రహదారిపై నిర్మించిన ఆకేరు కొత్త వంతెన (హైలెవల్ వంతెన) ఇటీవల వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. వంతెన చుట్టుపక్కల వాల్యాతండా, కస్నాతండాతో పాటు ఖమ్మం గ్రామీణ మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో పత్తి, వరి, మిరప, కూరగాయల పంటలు కొట్టుకుపోయి రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. వరద ఉద్ధృతికి హైలెవల్ వంతెనతోపాటు రహదారి ధ్వంసమైంది. తదనంతరం లోలెవల్ వంతెనను వినియోగంలోకి తెచ్చేలా రహదారిని అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం పాత వంతెన మీదుగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

– ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం గ్రామీణం



క్రమశిక్షణలేని విద్య చుక్కానిలేని నావ వంటిది: డీఐఈఓ

చర్ల, న్యూస్‌టుడే: క్రమశిక్షణలేని విద్య చుక్కానిలేని నావ వంటిదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హెచ్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల నిర్వహించిన ప్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని వివరించారు. చర్ల, దుమ్ముగూడెం ప్రధానాచార్యులు ఎన్.నరేందర్, కృష్ణవేణి, జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఖుర్షీద్ అన్వర్, లైబ్రేరియన్ జిల్లా అధ్యక్షుడు గురుదాచలం, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకటేశ్వర్‌రావు. చిత్రంలో ప్రధానాచార్యుడు నరేందర్

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

పరిశుభ్రత పాటించండి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య హెల్త్-ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ నాయక్ అన్నారు. లక్ష్మీనగరంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను బాలాజీ నాయక్ గురువారం సందర్శించారు. జిల్లా సర్వైలెన్స్ అధికారి సాయి, వైద్యాధికారి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: సారపాకలోని భాస్కర్‌నగర్‌లో మంచినీళ్ల రాక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
- స్థానికులు, భాస్కర్‌నగర్

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - మహేశ్, పంచాయతీ కార్యదర్శి
- బూర్గంపాడు, న్యూస్‌టుడే

అసౌకర్యాలతో అవస్థ.. రాజీవ్‌నగర్‌లో దురావస్థ

బూర్గంపాడు, న్యూస్‌టుడే



రాజీవ్‌నగర్‌లో రహదారులు ఇలా..

సారపాకలోని రాజీవ్‌నగర్‌లో అసౌకర్యాలతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అభివృద్ధికి చిహ్నాలైన సీసీ రహదారులు, మురుగుకాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు పోయే దారి లేక కొన్ని చోట్ల రహదారి మీదనే ప్రవహిస్తున్నాయి. మురుగునీరు ప్రవహించడంతో అవి దోమలకు ఆలవాలంగా మారుతున్నాయి. సీసీ రహదారులు లేకపోవడంతో వానాకాలంలో బురద దారిలో ప్రయాణించాల్సి వస్తోంది. మిషన్ భగీరథ నీళ్లు కూడా రోజూ రావడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కొన్నిచోట్ల పైపులు సైతం బిగించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్‌నగర్‌తోపాటు గాంధీనగర్, భాస్కర్‌నగర్ కాలనీల్లోనూ సీసీ రహదారులు, మురుగు కాలువల సమస్య వేధిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన మేర సీసీ రహదారులు, మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మహేశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా... నూతనంగా సీసీ రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

ఒకటి పదిలం.. మూడు భవనాలు శిథిలం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

మణుగూరు సమీపంలోని అన్నారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు చదువుకోవడానికి అనేక అవస్థలు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న నాలుగు భవనాల్లో మూడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. కొంత మేర సక్రమంగా ఉన్న ఒక భవనంలోనే ఉపాధ్యాయులు ఓ వైపు వారి కార్యకలాపాలు నిర్వహించుకుంటూ మరోవైపు విద్యార్థులకు చదువు చెబుతున్నారు. ఒకే గదిలో విద్యార్థులు, బడికి సంబంధించిన సామగ్రి, బియ్యం, బీరువాలు, ఇతర సామాన్లు ఉండటంతో విద్యార్థులు వాటి మధ్యలోనే కూర్చుంటున్నారు. సుమారు 15 నుంచి 20 మంది వరకు విద్యార్థులతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న ఈ పాఠశాలలో కనీస వసతులు కూడా అందుబాటులో లేవు. ఇదిలా ఉంటే నిరుపయోగంగా ఉన్న ఓ శిథిల భవనంలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు నిర్వాహకులు కట్టెలపొయ్యితో ఇబ్బందులు పడుతూ భోజనం సిద్ధం చేయాల్సిన పరిస్థితి. ఎప్పుడు కూలుతుందో తెలియని ఆ భవనంలో ఆమె వంట చేస్తున్న తీరును చూసి స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై హెచ్‌ఎం విజయలక్ష్మిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నూతన భవనం నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు.



పాఠశాలకు సంబంధించిన వస్తువులు ఉంచిన గదిలోనే కూర్చున్న విద్యార్థులు


'విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు'

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పుపై తెలంగాణ మంత్రివర్గ నిర్ణయం సరికాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అన్నపురెడ్డిపల్లిలో గురువారం వారు నిరసన చేపట్టారు. వనమా గాంధీ, దోసపాటి రాంబాబు, జంగాల శ్రీనివాసరావు, పుల్లారావు, శంకర్‌రావు, శ్రీను పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ గోడపత్రికల ఆవిష్కరణ

బూర్గంపాడు, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఏర్పాటై 50 ఏళ్లు పూర్తవుతున్నందున సారపాకలో గోడపత్రికలను విద్యావేత్త బ్రహ్మారెడ్డి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. అనంతరం విద్య అందరి కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మరుగున పడ్డ దొడ్లు..!



భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని విద్యా వనరుల విభాగానికి వెళ్లే దారికి పక్కన పదేళ్ల కిందట నిర్మించిన 20 మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. మన్యంలోని నిరుద్యోగ యువతకు ఈ ప్రాంగణంలో వైద్యుల శిక్షణ అందించే వారు. వీటికి ఇవి తోడ్పాటుగా ఉపయోగపడ్డాయి. వివిధ పనుల కోసం వచ్చే వారు ఉపయోగించేవారు. వీటి చుట్టూ పిచ్చి మొక్కలు ముళ్ల పొదలు అల్లుకుని నిర్వహణలోపంతో మూలనపడ్డాయి. ఈ మరుగుదొడ్లను పరిశీలించి వాడుకలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని ఏటీడీఏ అశోక్‌కుమార్ తెలిపారు. - భద్రాచలం, న్యూస్‌టుడే

జాలర్లకు శిక్షణ.. ప్రజలకు రక్షణ



వర్షాకాలంలో వరదలు సహజం. ఆ సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. కొట్టుకుపోవడం ఖాయం. ఈనేపథ్యంలో కొట్టుకుపోతున్న వారిని ఎలా కాపాడాలి? అన్న విషయంపై జాలర్లకు మణుగూరులోని పేరంటాల చెరువులో శిక్షణ ఇస్తున్నారు. ఆ చిత్రమే ఇదీ. మత్స్యశాఖ, మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కొనసాగుతోంది. శిక్షణలో జాలర్లు తర్ఫీదు పొందితే.. ప్రకృతి ఉపద్రవాల నుంచి ప్రజలను కాపాడవచ్చన్నది ఈ ఆలోచన. - మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

ఘనంగా సీతారామ కల్యాణోత్సవం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామికి పునర్వసు పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన కోవెలలో మూలమూర్తులకు అర్చకులు సుప్రభాత పఠిక ఆరాధించారు. వైదిక పెద్దలు చేసిన ప్రవచనం ఆకట్టుకుంది. నిత్య కల్యాణం గురించి ప్రవచిస్తుండగా దీనికి అనుగుణంగా వేదుక నిర్వహించారు. జీలకర్ర బెల్లం మాంగళ్యధారణ తలంబ్రాలు వేడుక కొనసాగించారు.



దుమ్ముగూడెం: పర్ణశాల రామాలయంలో శ్రీస్వామి వారి పునర్వసు కల్యాణం జరిగింది. శ్రీ సీతారామచంద్రస్వామిని నూతన పట్టువస్త్రాలతో ముస్తాబు చేశారు. ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, అర్చకులు భార్గవాచార్యులు, ఆలయ ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌బీ విద్యార్థినికి ఐటీడీఏ సాయం



రూ.36 వేల చెక్కు అందిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం, న్యూస్‌టుడే: దమ్మపేట మండలం జగ్గారం గ్రామానికి చెందిన మనీ దయానా హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ లా కళాశాలలో సీటు సాధించడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ రాహుల్ అభినందించారు. దయానా అదే మండలంలోని గండుగులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివింది. ఎల్‌ఎల్‌బీ ఎంట్రన్స్ పరీక్షల్లో 3,500 ర్యాంకు సాధించి లా సీటు దక్కించుకుంది. గురువారం ఈమెను భద్రాచలం పిలిపించి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.36 వేలు అందించారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా రామినేని రాంప్రసాద్ ఎన్నిక



అశ్వారావుపేట, న్యూస్‌టుడే: పీఆర్టీయూ అశ్వారావుపేట మండల అధ్యక్షుడిగా రామినేని రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దమ్మపేట మండల అధ్యక్షుడు పీఎస్ఎస్‌వీ ప్రసాద్ సారథ్యంలో గురువారం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా బి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా బీఎస్‌వీ సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షురాలిగా సీహెచ్ శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా ఎన్‌వీ ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా బి.హరికుమార్, మహిళా కార్యదర్శిగా డి.లీలావతి ఎన్నికయ్యారు.

గోశాల అభివృద్ధికి లయన్స్ క్లబ్ కృషి

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వినాయకపురం శ్రీలికలంగిండి ముత్యాలమ్మ తల్లి ఆలయం సమీపంలో ఉన్న గోశాలను అశ్వారావుపేట లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం సందర్శించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దూబగుంట దుర్గారావు, సభ్యులు కొఠారు చలపతి, యూఎస్ ప్రకాశ్, కొటగిరి సీతారామస్వామి, బిర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తపాలా ఖాతా ఉండాలి: ఐపీఓ

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి తపాలాశాఖ ఆధ్వర్యంలో ఖాతా ఉండేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని పాల్వంచ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వీరన్న ఆదేశించారు. అశ్వారావుపేట, దమ్మపేట ఉప తపాలా కార్యాలయాల పరిధిలోని గ్రామీణ డాక్ సేవకులు, తపాలా సిబ్బందితో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి బ్రాంచి పోస్టాఫీసులో 250 ఖాతాలు ప్రారంభించాలని సూచించారు. ఎస్‌పీఎం ఉదయ్‌కుమార్, పలువురు బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుడి నుంచి అల్లోపతి మందులు స్వాధీనం

చర్ల, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా అల్లోపతి మందులు విక్రయిస్తున్న సత్యనారాయణపురంలోని గ్రామీణ వైద్యుడిపై జిల్లా ఔషధ తనిఖీ అధికారి సీహెచ్ సంపత్‌కుమార్ గురువారం కేసు నమోదు చేశారు. సదరు గ్రామీణ వైద్యుడి నుంచి రూ.20 వేల విలువైన 29 రకాల మందులను స్వాధీనం చేశారు. ఈ మందులను భద్రాచలం న్యాయస్థానంలో ప్రవేశపెట్టినట్లు ఔషధ నియంత్రణ అధికారి తెలిపారు.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

కరకగూడెం: కరకగూడెం ఎంఈఓగా గడ్డం మంజుల గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కరకగూడెం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయులు, ఆదివాసీ టీచర్ అసోసియేషన్ నేతలు మంజులను సన్మానించారు.

మావోయిస్టు సానుభూతిపరులు అరెస్టు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఇద్దరు మావోయిస్టు సానుభూతిపరులను పోలీస్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. చింతల్నార్ ప్రాంతానికి చెందిన మంతోష్ మండల్, నర్గాజున్ అనే ఇద్దరు మావోయిస్టు సానుభూతిపరులను కోంతాకాలంగా మావోయిస్టులకు సహకరిస్తున్నారు. పేలుడు పదార్థాలు, మొబైల్స్, సిమ్‌కార్డులు తదితర సామగ్రిని వీరి వద్ద నుంచి పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

మత్స్యకారులకు అవగాహన

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: గంగోలు చెరువులో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారులు ఎస్.కోటేశ్వరరావు, బి.భార్గవ్‌సాయికుమార్, ఎం.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతల్లి కంఠాభరణం ఘంటసాల

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: తెలుగుతల్లి కంఠాభరణం ఘంటసాల వెంకటేశ్వరరావు అని వక్తలు కొనియాడారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘంటసాల ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో డా.ఆకినేని నాగేశ్వరరావు పురస్కారాల ప్రదానోత్సవం గురువారం జరిగింది. కాకతీయ వర్సిటీ విశ్రాంత ప్రొ. తిరుపతయ్య, గాయకుడు ప్రభాకర్ (భద్రాద్రి), శంకర్ ప్రసాద్ (మునగాల), న్యాయవాది రంగనాథ్, గాయకులు పి.వి.రమణ (భీమవరం), బీగల్ అయ్యర్ నాగరాజులకు పురస్కారాలు ప్రదానం చేశారు. సభలో భద్రాచలానికి చెందిన జగదీశ్, రంగారెడ్డి, లక్ష్మీనారాయణ మాట్లాడారు.

బయో మైనింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని పురపాలకాల్లో బయోమైనింగ్ విధానంలో చెత్త శుద్ధీకరణ చేపట్టాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. పురపాలక కమిషనర్లతో గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డుల్లో పేరుకున్న ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బొండాలు, బట్టలు, అద్దాలు, రాళ్లను బయోమైనింగ్ యంత్రాల ద్వారా రీసైక్లింగ్ చేయాలన్నారు. మట్టితో కూడిన తడి వ్యర్థాల్ని వర్మీ కంపోస్టు ఎరువుగా మార్చి మొక్కలకు ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతో మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. అన్నిచోట్ల బయో మైనింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో వెదురు, బాదం మొక్కలను పెంచాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: గీత కార్మికులకు రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక శాసన సభ్యుడు జారే ఆదినారాయణ అన్నారు. ఆబ్కారీ, వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచ్ పేరుతో గురువారం శిక్షణ ఇచ్చారు. చెట్టు ఎక్కే విధానం, భీమా పథకాల గురించి వివరించారు. బీసీ కార్పొరేషన్ జిల్లా సహాయ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఆబ్కారీ ఎస్ఐ రాజేష్, పోలీసు ఎస్ఐ యయాతి రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, సుంకవల్లి వీరభద్రరావు, బాబూరావు పాల్గొన్నారు.



అశ్వారావుపేటలో రక్షా కవచ్‌తో చెట్టు ఎక్కుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ, న్యూస్‌టుడే: అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఏడాదికి ఐదు గ్రామాలను దత్తత తీసుకొని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మీ ఊరికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి పంచాయతీ మద్దుకూరులో గురువారం రచ్చబండ కార్యక్రమం జరిగింది. మద్దుకూరు గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామస్థులు తెలిపిన సమస్యలు పరిష్కారానికి ప్రణాళిక తయారు చేస్తానన్నారు. మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మధు, ఎంఈఓ సత్యనారాయణ, ఏఈలు నర్సింహారావు, శ్రీనివాసరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గౌతమీనగర్‌లో వైద్య ఆరోగ్య శిబిరం

అశ్వాపురం, న్యూస్‌టుడే: గౌతమీనగర్‌లో విదుల నిర్వహించే కాంట్రాక్టు కార్మికులకు గురువారం గౌతమీనగర్‌లోని భారజల ప్లాంట్ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. భారజల ప్లాంట్ జీఎం ఎస్.జగ్గారావు ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

దమ్మపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగాపురంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సీతారాంపురానికి చెందిన కామినేని శ్యాంబాబు(39) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మంగాపురం వెళ్లారు. అతి వేగం కారణంగా గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడింది. ఈ క్రమంలో తీవ్ర గాయాలైన శ్యాంబాబు అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.5 వేలు కాజేసిన ఇద్దరు మహిళలు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని రద్దీగా ఉన్న ఓ ప్రాంతంలో ఇద్దరు మహిళలు తమ చేతివాటాన్ని ప్రదర్శించిన వైనం సీసీ కెమెరాల్లో బట్టబయలైంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం స్థానిక బ్యాంక్ రోడ్డులోని జిరాక్స్ సెంటర్ వద్దకు ఓ వృద్ధురాలు జిరాక్స్ పని నిమిత్తం వెళ్లారు. అక్కడ రద్దీ ఉంది. ఈ హడావుడిలో ఆమె వద్ద ఉన్న పర్సును ఇద్దరు మహిళలు తెలియకుండా చాకచక్యంగా కాజేశారు. తన వద్ద ఉన్న పర్సు పోయిందని వృద్ధురాలు గుర్తించి తెలియని వ్యక్తులు కాజేశారని ఆందోళన చెందారు. రూ.5 వేలు ఈ నష్టానికి గురి కావడంతో అక్కడి వారి సాయంతో సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఇద్దరు మహిళలను పట్టుకుని పర్సు, నగదు సదరు ఉద్యోగినికి స్థానికులు అప్పగించారు. పట్టుపడిన మహిళలతో చిన్నపిల్లలు ఉండటంతో మందలించి వదిలేసినట్లు తెలిసింది.

ఇసుక లారీలు నిలిపివేత

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: తూరుబాక వద్ద ఇసుక లారీలను పోలీస్ అధికారులు గురువారం నిలిపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు దెబ్బతిని ప్రమాదకరంగా తయారైంది. దీంతో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇసుక రీచ్ నుంచి ఇసుకను లోడ్ చేసుకొని భద్రాచలం వైపు వెళ్తున్న లారీలను ఎక్కడికక్కడ నిలిపివేశారు.



బీటీపీఎస్‌లో నిరసన తెలుపుతున్న విద్యుత్ వికాస నాయకులు

'రామగుండం విద్యుత్కేంద్రాన్ని జెన్‌కో మాత్రమే నిర్మించాలి'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రామగుండంలో తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలోనే విద్యుత్కేంద్రాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ మణుగూరులోని బీటీపీఎస్‌లో గురువారం విద్యుత్ వికాస ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వికాస నాయకుడు రవిప్రసాద్ మాట్లాడుతూ.. రామగుండంలో మూసివేసిన ఆర్‌టీఎస్ స్థానంలో సింగరేణి, జెన్‌కో సంయుక్తంగా విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలన్నారు. వికాస నాయకులు రవితేజ, సాయి, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర సర్వీసు కార్యాలయం ఏర్పాటు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు శాఖకు చెందిన కేంద్ర ఇంటెలిజెన్స్ సర్వీసు విభాగ కార్యాలయం భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. స్థానిక ఆబ్కారీ స్టేషన్ సమీపంలో పాత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఖాళీస్థలాన్ని అధికారులు ఇందుకు పరిశీలించి స్థలాన్ని శుభ్రం చేయించారు. గత 20 ఏళ్ల నుంచి అదే రోడ్డులో ఏర్పాటు చేసుకున్న వెల్డింగ్, ఎలక్ట్రిక్, స్కిల్ల్ రింగ్ వంటి చిరు దుకాణాలను, తాత్కాలిక షెడ్‌లను గ్రామ పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని అధికారులు గతంలో ఇచ్చిన రెండు దఫాలుగా ఆదేశించినట్లు తెలిసింది. భద్రాచలం ఏఎస్పీ స్థలాన్ని పరిశీలించి వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు.



కార్యాలయం ఏర్పాటు చేయనున్న స్థలం

చాకలి ఐలమ్మకు నివాళి

మణుగూరు సాంస్కృతికం, అశ్వాపురం, కరకగూడెం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, అళ్లపల్లి, న్యూస్‌టుడే: మణుగూరులో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, భారాస కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రజక సంఘాల కార్యాలయంలో ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పోగుల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

★ కరకగూడెంలో తహసీల్దార్ నాగ ప్రసాద్, దుమ్ముగూడెంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, బూర్గంపాడులో ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ జమలారెడ్డి తదితరులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆళ్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలోని వివేకానంద కూడలిలో ఐలమ్మ చిత్రపటానికి పలువురు నివాళి అర్పించారు. రజక సంఘం నాయకులు బుజ్జిబాబు, గాడివర్ల శ్రీను, గుమ్మడి ఆదినారాయణ, గుమ్మడి శ్రీను, రాంప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు. ములకలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మహాలక్ష్మి, అన్నపురెడ్డిపల్లిలో తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్ ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొండికుంటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



అశ్వారావుపేటలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

అర్ధాంతరంగా నిలిచిన రెండు పడకల గదుల ఇళ్లు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మామిళ్లవారిగూడెంలో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. భారాస హయాంలో 2017లో 20 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఒక్కొ ఇంటికి రూ.5.04 లక్షల చొప్పున మొత్తం రూ.1.08 కోట్లు కేటాయించారు. కానీ, రూ.20 లక్షల వరకు ఖర్చుచేసి పునాదులు, పిల్లర్ల వరకు నిర్మించారు. ఆయా పనులను 2019లోనే గుత్తేదారు నిలిపేశారు. అప్పట్నుంచి పనుల్లో ఎలాంటి కదలిక కనిపించలేదు. ఇంటి జాగా కూడా లేని నిరుపేదల కోసం ఈ నిర్మాణ ప్రదేశానికి సమీపంలో గుడిసెలు నిర్మించుకుని కాలం వెళ్లదీస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను అర్హులకు కేటాయించి 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద సాయం చేయాలని కొందరు అధికారులను కోరుతున్నారు. నిరుపేదలు తామే నిర్మాణ పనులు పూర్తిచేసుకుంటామని ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు.



అసంపూర్తిగా రెండు పడకల గదుల ఇళ్లు

✦ ఈ అంశాన్ని స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకు వెళ్లగా నిరుపేదల డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమానిత వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారమివ్వాలి

మణుగూరు సాంస్కృతికం, గుండాల, న్యూస్‌టుడే: గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు ఎవరైనా వస్తే పోలీసులకు కచ్చితంగా సమాచారమివ్వాలని సీఐ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మణుగూరులోని పగిడేరు ఎస్సీకాలనీ, గొత్తికోయ గుంపు గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. గొత్తికోయ గ్రామ ప్రజలు తమ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ వెళ్లాలనుకుంటే తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. గ్రామ ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై రంజిత్, టీఎస్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

★ మావోయిస్టులకు సహకరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గుండాల సీఐ రవీందర్ అన్నారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా గురువారం గుండాల మండలం దామరతోగు గ్రామాన్ని సందర్శించారు. అక్కడి ప్రజలు, యువకులతో మాట్లాడారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీస్ సిబ్బంది మంగయ్య, వెంకటేశ్వర్లు, స్పెషల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రుగొండ, న్యూస్‌టుడే: ఎర్రబోదు ప్రాంతానికి కొత్తగా ఎవరైనా వస్తే సమాచారం ఇవ్వాలని చంద్రుగొండ ఎస్సై గంజి స్వప్న అన్నారు. చంద్రుగొండ మండలం బెండాలపాడు సమీపంలో అటవీ ప్రాంతంలోని ఎర్రబోదు గ్రామాన్ని గురువారం ఆమె సందర్శించారు. పోలీసు సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. పోలీస్ సిబ్బంది కోటి, రాంలాల్, హోంగార్డ్ సురేష్, బెండాలపాడు గ్రామపెద్ద బొర్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పగిడేరులోని గొత్తికోయ గ్రామ ప్రజలకు సూచనలిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలకు బానిస కాకూడదని సన్మార్గంలో నడవాలని ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన-ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ మాట్లాడుతూ... యువత, విద్యార్థులు డ్రగ్స్ వాడరాదని, ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, నయంపాషా, జీవన్, చందు పాల్గొన్నారు.

కొత్తగూడెం

•కొత్తగూడెం • ఇల్లెందు

'మావోయిస్టుల చర్యలతో ఆదివాసీల జీవితాలు దుర్భరం'

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: మన్యంలో అభివృద్ధికి అవరోధంగా నిలుస్తూ, ఆదివాసీల జీవితాలను దుర్భరం చేస్తున్న మావోయిస్టులు 20 ఏళ్ల సంబురాలు ఎవరి కోసం చేస్తున్నారని జిల్లా ఆదివాసీ హక్కుల సంఘం గురువారం ఓ ప్రకటనలో ప్రశ్నించింది. ఇన్ఫార్మర్ల పేరుతో నీల్సో వంటి ఆడబిడ్డలను హత్య చేశారని ఆరోపించింది. పార్టీ అగ్ర నాయకుల మధ్య ఆధిపత్య ధోరణితో ప్రబలిన విభేదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంది. బూటకపు నూతన ప్రజాస్వామిక విప్లవం పేరుతో బాంబులు పేల్చి ఆదివాసీలు, మూగజీవాల ప్రాణాలను బలిగొంటున్నారని సంఘం ఆవేదన వెలిబుచ్చింది. ఆదివాసీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తక్షణం కావాల్సింది విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, రవాణా, సమాచార సదుపాయాలని పేర్కొంది.

300 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ నుంచి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెజీనా స్కూల్ సమీపంలో పౌర సరఫరాల ఉప తహసీల్దారు శ్రీనివాసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని ఠాణాకు తీసుకెళ్లారు. అవి రేషన్ బియ్యమని తేలడంతో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అబ్దుల్ రజాక్‌పై కేసు నమోదు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: సూర్యాప్యాలెస్ పక్కనుంచి వెళ్లే రోడ్డులో పురపాలక నీటి సంపు ప్రమాదకరంగా మారింది. దాని వద్ద ఎలాంటి రక్షణ లేదు.



రక్షణగా ఉంచిన ఇనుప షీట్ వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. **- స్థానికులు**

సమాధానం: సంపుపై పూర్తిస్థాయి రక్షణ ఉండేలా ఇనుప షీట్‌ను సరిచేయిస్తాం. **శేషు, కమిషనర్ -** కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

పాల్వంచ జయమ్మకాలనీలో డ్రైనేజీలో పూడిక తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. **- ప్రేమ్, స్థానికుడు**

✔ జవాన్‌కు చెప్పి కాలువ శుభ్రం చేయిస్తాం. **- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి - పాల్వంచ, న్యూస్‌టుడే**

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: అఖిల భారతీయ మజ్దూర్ సంఘ్ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. సీఎంపీఎఫ్‌లో అవినీతిపై దర్యాప్తునకు, లాభాలపై శ్వేతపత్రం విడుదలకు బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్వోటూజీఎం కోటిరెడ్డికి వినతిపత్రాన్ని పవన్‌కుమార్, రవి, చందర్, శ్రీనివాస్ అందజేశారు.

వేతనాలు పెంచాలని డిమాండ్

కొత్తగూడెం సింగరేణి: ఒప్పంద కార్మికులకు సింగరేణి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి అన్నారు. సెంట్రల్ వర్క్‌షాపు, బంగ్లోస్‌లో గురువారం జరిగిన ద్వార సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వీరన్న సంపత్, శ్రీనివాస్, నాగమణి, లక్ష్మి, నాగేంద్రబాబు, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఒప్పంద కార్మికులు

విస్తరణకు వేళాయె..!

ఇల్లెందు పట్టణం, న్యూస్‌టుడే

28న ప్రజాభిప్రాయ సేకరణ

ఎన్‌హెచ్-930పీ విస్తరణ పనుల్లో కదలిక మొదలైంది. హైదరాబాద్ ఓఆర్ఆర్(ఔటర్ రింగ్ రోడ్డు) సమీపంలోని గౌరెల్లి వయా వలిగొండ నుంచి కొత్తగూడెం వరకు 230కి.మీ. మేర రోడ్డు నిర్మాణానికి జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ (ఎన్‌హెచ్ఏ) నాలుగేళ్ల క్రితమే రూపకల్పన చేసింది. సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను 2021 ఏప్రిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించింది. ప్రభుత్వాలు ఆమోదించాయి. రహదారి విస్తరణలో భాగంగా కోల్పోతున్న భూములు, ఇళ్లకు ఇప్పటికే ప్రైవేటు కన్సల్టెన్సీ బృందాలు మార్కింగ్ ఇచ్చాయి. ఇల్లెందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల మీదుగా వెళ్లే రహదారి కోసం భూసేకరణ ప్రక్రియలో భాగంగా తాజాగా కేంద్ర ప్రభుత్వం బహిరంగ ప్రకటన జారీచేసింది. ఈనేపథ్యంలో భూములు, ఇళ్లు కోల్పోయే వారిలో ఆందోళన మొదలైంది. ప్రజాభిప్రాయాలను ఇల్లెందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి తహసీల్ కార్యాలయాల్లో శనివారం సేకరించనున్నారు.

నెహ్రూనగర్- కొత్తగూడెం క్రాస్‌రోడ్డు వరకు 52 కి.మీ.

భద్రాద్రి జిల్లాలో నెహ్రూనగర్ నుంచి కొత్తగూడెం క్రాస్‌రోడ్డు వరకు 52కి.మీ. మేర జాతీయ రహదారి ఉండబోతుంది. దీని పరిధిలో ఇల్లెందు మండలం చల్లసముద్రం, సుదిమళ్ల, టేకులపల్లి మండలం బేతంపూడి, గొల్లపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలంలోని రెవెన్యూ గ్రామాలు ఉండనున్నాయి. ఇది పూర్తిగా నాలుగు లైన్ల రహదారి. జిల్లా పరిధిలో 100కుపైగా కల్వర్టులు నిర్మించనున్నారు. సులానగర్ వద్ద టోల్‌గేట్ రానున్న నేపథ్యంలో అక్కడ పైవంతెన, అనిశెట్టిపల్లి వద్ద హైలెవల్ వంతెనలు నిర్మించనున్నారు. పూర్తిగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. హైవే ప్రారంభం కానున్న గౌరెల్లి నుంచి నెహ్రూనగర్- నామాలపాడు(మహబూబాబాద్ జిల్లా) వరకు రెండు వరుసల రహదారికి రూపకల్పన జరిగింది.

ఇల్లెందుకు బైపాస్..

జాతీయ రహదారి ఇల్లెందు పట్టణం లోపలికి రాకుండా బైపాస్‌కు రూపకల్పన చేశారు. పోలంపల్లి మీదుగా ఉసిరికాయలపల్లి వయా ఇల్లెందు- ఖమ్మం ప్రధాన రహదారి క్రాస్‌చేస్తూ లలితాపురం మీదుగా మొదుగులగూడెం వరకు సుమారు 10కి.మీ. మేర నాలుగు లైన్ల బైపాస్ నిర్మించనున్నారు. ఇప్పుడున్న రహదారికి రెండువైపులా కర్వ్‌లను బట్టి 75 అడుగుల స్థలం సేకరించనున్నారు. కర్వ్‌లను బట్టి 8.75 మీటర్లతో రెండువైపులా రోడ్డు, 15 అడుగుల్లో డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మించనున్నారు. జాతీయ రహదారికి క్రాస్‌రోడ్లు ఉన్నచోట రద్దీ దృష్ట్యా కూడళ్ల విస్తరణ తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు.



ఎన్‌హెచ్-930పీలో భాగంగా విస్తరణకు నోచుకోనున్న ఇల్లెందు- కొత్తగూడెం ప్రధాన రహదారి

భూసేకరణ ప్రక్రియ జరగనుందిలా..

ఎన్‌హెచ్- 930పీలో భాగంగా ఇల్లెందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలో అటవీ, రెవెన్యూ భూమి సేకరించనున్నారు. ఇందుకోసం 22కి.మీ. మేర సుమారు 130 ఎకరాల అటవీ భూమి, 30కి.మీ. పరిధిలో రెవెన్యూ, ప్రభుత్వ భూమి అవసరమవుతుంది. టేకులపల్లి మండలం బేతంపూడి రెవెన్యూ పరిధిలో 11.45, గొల్లపల్లి- 1.71, ఇల్లెందు మండలం చల్లసముద్రం- 0.1906, సుదిమళ్ల- 20.246, లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ- 3.6616, సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలో 25.32 హెక్టార్ల భూమిని సేకరించనున్నారు. సుమారు రూ.50కోట్ల నష్టపరిహారం చెల్లించనున్నారు.

చివరి ప్యాకేజీలో భాగంగా భూమిని సేకరించాల్సి ఉంది. రెవెన్యూ, అటవీ భూముల సేకరణ ప్రక్రియ పూర్తిచేసుకుని మరో ఏడాదిలో పనులు ప్రారంభించేలా సన్నాహాలు జరుగుతున్నాయి. గతంలో ప్రతిపాదించిన బడ్జెట్‌ను మళ్లీ మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిస్తాం. **- ఉయ్యూరు యుగేంధర్, ఎన్‌హెచ్ ఈఈ, ఖమ్మం**

వరద సమస్యకు పరిష్కారం

స్పందనకు వందనం

తిలక్‌నగర్ పంచాయతీ బొల్లినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో వరద చేరిన వైనంపై 'ఈనాడు'లో 'బడి చుట్టూ నీరు' శీర్షికతో గురువారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఆవరణ, పరిసరాల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకున్నారు.

- ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే



వ్యర్థాలతో ఆకట్టుకునే ఆకృతులు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: 'స్వచ్ఛతా హీ సేవా'లో భాగంగా స్థానిక పురపాలక కార్యక్రమంలో వేస్ట్ టూ ఆర్ట్ ప్రదర్శనను గురువారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తమ నివాసాల్లో సేకరించిన పొడి చెత్తతో వివిధ ఆకృతులను తయారు చేసి ప్రదర్శించారు. ప్రదర్శనను సందర్శించిన ఛైర్‌పర్సన్ సీతాలక్ష్మి, కమిషనర్ శేషు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పాల్గొన్నారు.



ఆకృతులను చూస్తున్న ఛైర్‌పర్సన్ సీతాలక్ష్మి, కమిషనర్ శేషు, అధికారులు

మూసుకుపోయే దారిలో.. ముందుకు సాగేదెట్టా?

దంతెలబోర-ములకలపల్లికి వెళ్లే రహదారి మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. అసలే మట్టి రహదారి.. ఆపై సుమారు 5 కి.మీ. పొడవునా రెండువైపులా చెట్లపొదలు దట్టంగా అలుముకున్నాయి. దీంతో రెండు మండలాల ప్రజలు, రైతులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. చీకటైతే కాలినడకా సాగించే పరిస్థితి లేదు. పీఆర్ ఏఈ శివలాల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఎమ్మెల్యే కూనంనేని సూచనతో వారం క్రితం రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

- పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే



పల్లెటూరి విద్యార్థినులు.. సైకిల్‌పై చలో చలో



లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా ఎన్నారై ఫౌండేషన్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హేమచంద్రాపురం ఉన్నత పాఠశాలలో పది మంది విద్యార్థినులకు సైకిళ్లను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా డీఈవో వెంకటాచారి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుడు రామారావు విన్నపంతో ఎన్నారై రవి దేవిశెట్టి ఆర్థిక సాయంతో సైకిళ్లు అందించినట్లు హెచ్.ఎం. శ్రీనివాస్ తెలిపారు.

సెక్యూరిటీ గార్డుల తొలగింపు అన్యాయం

ఇల్లెందు గ్రామీణం: సోలార్ ప్లాంట్‌లో పని చేసేందుకు జనవరిలో 35 మంది ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను నియమించారని, వారిని ఈ నెల 3న కేవలం వాట్సాప్ మెసేజ్‌తో తొలగిస్తున్నట్లు ప్రకటించడం అన్యాయమని సీఐటీయూ నాయకులు అబ్దుల్ నబీ అన్నారు. సోలార్‌ప్లాంట్, ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయం ముందు గురువారం ఆందోళన నిర్వహించి ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

పురపాలకాల్లో బయో మైనింగ్ ప్లాంట్లు: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని పురపాలకాల్లో బయోమైనింగ్ విధానంలో చెత్త శుద్ధీకరణ చేపట్టాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. పురపాలక కమిషనర్లతో గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డుల్లో పేరుకున్న ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బోండాలు, బట్టలు, అద్దాలు, రాళ్లను బయోమైనింగ్ యంత్రాల ద్వారా రీసైక్లింగ్ చేయాలన్నారు. మట్టితో కూడిన తడి వ్యర్థాల్ని వర్మీ కంపోస్ట్ ఎరువుగా మార్చి మొక్కలకు ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతో మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. అన్నిచోట్ల బయో మైనింగ్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో వెదురు, బాదం మొక్కలను పెంచాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట పటిమ అందరికీ ఆదర్శం: ఎస్పీ

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: రైతాంగ సాయుధ పోరాటం చేసి మహిళల్లో స్ఫూర్తిని నింపిన చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ బి.రోహిత్‌రాజు అన్నారు. ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని ఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, శ్రీనివాస్, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జితేందర్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. ● పురపాలక సంఘ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి ఛైర్‌పర్సన్ కె.సీతాలక్ష్మి, కమిషనర్ శేషు, కౌన్సిలర్లు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

టేకులపల్లి, ఇల్లెందు గ్రామీణం: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన వీరనారి ఐలమ్మ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఐలమ్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఎస్సై పి.సురేష్, కళాశాల ప్రిన్సిపాల్ సులోచనారాణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తహసీల్దార్ కె.నాగభవాని ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ● ఇల్లెందు జగదాంబ సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జరిగిన ఐలమ్మ జయంతి కార్యక్రమంలో భారాస వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్, నాయకులు సిలివేరి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రేణుక, సరిత, బావ్‌సింగ్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు, డీఈ మురళి, ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొ. వై.చిన్నప్పయ్య తదితరులు ఐలమ్మకు నివాళులర్పించారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ బి. రోహిత్‌రాజు



టేకులపల్లి: ఎమ్మెల్యే కోరం కనకయ్య...



చుంచుపల్లి: జడ్పీ కార్యాలయంలో సీఈవో చంద్రశేఖర్‌రావు



ఇల్లెందులో.. దిండిగాల రాజేందర్ తదితరులు



జూలూరుపాడు మండలం వినోభానగర్‌లో గ్రామస్థులు..

'ఎంసీహెచ్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తాం'

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రామవరం ఎంసీహెచ్ సమస్యలను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ అన్నారు. ఆసుపత్రిని గురువారం ఆయన పలువురు నాయకులతో కలిసి సందర్శించారు. గర్భిణులను చిన్న చిన్న సమస్యలకు రిఫరల్ చేయొద్దని చిన్ని అన్నారు. సమస్యలను మంత్రి, కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు. కార్యమంలో రావి రాంబాబు, ఉమర్, రవిగౌడ్, పాషా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు చిన్ని

గంజాయిని పసిగట్టిన జాగిలం

ఇల్లెందు గ్రామీణం: పట్టణంలో ఓ ఇంట్లో దాచిపెట్టిన 600 గ్రాముల గంజాయిని జాగిలం సహాయంతో పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్.ఐ. నాగుల్‌మీరా పఠాన్ తెలిపిన వివరాల ప్రకారం.. నెం.2 బస్తీకి చెందిన పి.సురేష్ ఇంట్లో గంజాయి ఉందన్న సమాచారంతో పోలీసులు సోదాలు చేపట్టారు. సరకును రాగబోయినగూడెంకు చెందిన వెంకటరమణ, శివకృష్ణ వద్ద కొనుగోలు చేసినట్టు నిందితుడు అంగీకరించాడు.

వృద్ధ దంపతులకు గాయాలు

కామేపల్లి, న్యూస్‌టుడే: కొత్తగూడెనికి చెందిన వృద్ధ దంపతులు తులసీరామ్, కళావతి ఖమ్మంలో ఉన్న కుమార్తె వద్దకు టీవీఎస్ వాహనంపై గురువారం వెళ్తున్నారు. తాళ్లగూడెం వద్దకు రాగానే కళావతి చీరకొంగు వాహన చక్రంలో పడటంతో అదుపు తప్పి దంపతులిద్దరూ కిందపడ్డారు. గాయాలైన వారిద్దరినీ ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

జూనియర్ న్యాయవాది మృతికి సంతాపం

కొత్తగూడెం న్యాయవిభాగం: కొత్తగూడెం కోర్టులో జూనియర్ న్యాయవాది వ్యవహరిస్తున్న అంకం మల్లేశ్ (52) గుండెపోటుతో గురువారం మరణించారు. న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు సంతాపం తెలిపారు.

మత్తు అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: మత్తు అనర్థాలపై లక్ష్మీదేవిపల్లి మండలం త్రివేణి పాఠశాల వసతి గృహ విద్యార్థులకు కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సైలు మదార్, నరేశ్‌లు గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో చెడు అలవాట్ల జోలికెళ్లొద్దన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచకు చెందిన మిర్యాల సైదేశ్వరరావు కాలేయ సంబంధ వ్యాధితో చికిత్సపొందుతున్నాడు. వాసవీక్లబ్, వర్తక సంఘం నాయకులను ఆశ్రయించగా వైద్య ఖర్చులకు రూ.20 వేలు అందించినట్లు వర్తక సంఘం కన్వీనర్ చలువాది ప్రకాశ్ అన్నారు. రామకృష్ణ, కుటుంబరావు, కార్తీక్, శివ, జనార్దన్, ప్రవీణ్, రవి, సతీష్ పాల్గొన్నారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

కొత్తగూడెం విద్యావిభాగం: ప్రత్యేకావసరాల పిల్లల వివరాలను ప్రశస్థ యాప్‌లో నమోదు చేయాలని సమ్మిళిత విద్య సమన్వయకర్త సైదులు అన్నారు. చుంచుపల్లి మండలం బాబుక్యాంప్ ఉన్నత పాఠశాలలో 'యాప్'పై శిక్షణను గురువారం నిర్వహించారు. ఎంఈఓ బాలాజీ, హెచ్‌ఎం నీరజ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రశస్థ యాప్‌లో వివరాలను నమోదుపై జిల్లా అధికారులు సైదులు, సతీశ్ అవగాహన కల్పించారు. జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు.

ఇల్లెందు గ్రామీణం: ప్రశస్థ యాప్ వివరాలపై ఇల్లెందులో పలు పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ నిర్వహించారు. శుక్రవారం కూడా కార్యక్రమం కొనసాగనుంది. ఎంఈవో టీవీఆర్‌ఎన్ స్వామి పర్యవేక్షణలో ఎల్.రాంబాబు, వి.రవికిరణ్, శ్రీసుమలు సూచనలు చేశారు.

ముగిసిన శిక్షణ

లక్ష్మీదేవిపల్లి: గ్రామాల్లో శుద్ధ జలం అందేలా కృషిచేయాలని జడ్పీ సీఈవో చంద్రశేఖర్‌రావు అన్నారు. గట్టుమళ్ల రైతువేదికలో ఏర్పాటైన మంచినీటి సహాయకుల 'నల్‌జల్ మిత్ర' శిక్షణ గురువారం ముగిసింది. భగీరథ ఇంట్రా ఈఈ తిరుమలేశ్, డీఈ శివయ్య, ఏఈ వెంకటస్వామి, ఎంపీడీవో చలపతిరావు పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగంలో పొదుపు పాటించాలి: ఎస్ఈ



రైతులకు సూచనలిస్తున్న ఎస్ఈ మహేందర్

జూలూరుపాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగంలో రైతులు పొదుపు పాటించాలని ఎస్ఈ మహేందర్ రైతులకు సూచించారు. జూలూరుపాడు మండలం అనంతారంలో గురువారం విద్యుత్తు సంస్థ నిర్వహించిన పొలం బాట కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యుత్తు వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ రంగస్వామి, ఏడీఈ యాసిన్, ఏఈ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

'యువజనోత్సవ' ప్రతిభావంతులకు అభినందన



పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాల్వంచ విద్యార్థుల బృందం..

పాల్వంచ: కొత్తగూడెంలో జరిగిన యువజనోత్సవాల్లో పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని శ్రావణి ఉపన్యాసంలో, కవిత్వంలో విజయలక్ష్మి, సోలో డ్యాన్స్‌లో పూజిత బృందం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బి.ఝాన్సీ గురువారం తెలిపారు. వ్యాసరచన, చిత్రలేఖనం, నృత్య పోటీల్లో తమ విద్యార్థులు యువక్రితి, ఆశ్విత, నిఖిత, జూబేదా, మాధవి ప్రతిభ కనబరినట్లు అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ భరత్‌కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ అవని, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



విజేత విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

'హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం'



సభ్యత్వ నమోదులో వినోద్‌రావు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని భాజపా రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు అన్నారు. జూలూరుపాడు మండలంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. పలు గ్రామాల్లో పర్యటించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ, రైతు భరోసా ఇప్పటి వరకు పూర్తిగా ఇవ్వలేకపోయిందన్నారు. సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చి జూలూరుపాడు నుంచి ఏన్కూరు వరకు లింకు కెనాల్ నిర్మాణం చేపట్టి, రైతులకు నయా పైసా పరిహారం ఇవ్వలేదన్నారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్, నెల్లూరి కోటేశ్వరరావు, మాదినేని సతీశ్, రమేశ్, తెల్లం నరసింహారావు, కార్తిక్ పాల్గొన్నారు.

క్రీడాకారుల బృందం ఎంపిక

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో వచ్చే ఆది, సోమవారాల్లో జరగనున్న భద్రాద్రి యూనిట్ డివిజన్ల స్థాయి క్రీడాపోటీలకు పాల్గొననున్న జట్లను గురువారం ఇల్లెందు ఇన్‌ఛార్జి ఎఫ్‌డీవో కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, పరుగు పందేల్లో కొత్తగూడెం-ఇల్లెందు యూనిట్‌తో పాటు భద్రాచలం, మణుగూరు, పాల్వంచ నుంచి పలు జట్లు పాల్గొననున్నాయి. ఎంపిక ప్రక్రియలో డివిజన్ ఎఫ్ఆర్ఓలు, డీఆర్ఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి సభ్యత్వ నమోదు

కొత్తగూడెం కలెక్టరేట్: జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల హౌసింగ్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యుల సభ్యత్వ నమోదును ఈ నెల 27వ తేదీ నుంచి చేపట్టనున్నట్లు ఆ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు కె.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని సొసైటీ కార్యాలయంలో ఇవ్వాలని, వివరాలకు కోశాధికారి పూర్ణశేఖర్‌ను సంప్రదించాలన్నారు.

రేపు 'సనాతన హిందూ ధర్మ ఐక్యవేదిక' ప్రదర్శన

చుంచుపల్లి: తిరుమలలో లడ్డూ అపచారం నేపథ్యంలో సనాతన హిందూ ధర్మ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 28న గణేశ్ టెంపుల్ నుంచి విద్యానగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు చేపట్టే ప్రదర్శనను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు దారా రమేశ్, ఐక్య వేదిక సభ్యులు కొదమసింహం పాండురంగాచార్యులు, వర్ధన్‌రావు,రమాదేవి, పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్సలూ.. ఇల్లెందు సీహెచ్‌సీలోనే..

చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి మన్యం ప్రాంతంలోని కీలకమైన ఇల్లెందు ప్రభుత్వ దవాఖానాలో తొలిసారిగా సేవలు అందుబాటులోకి వచ్చాయి. రోగులకు స్థానికంగానే ఉపశమనం కలిగించేలా ఈఎన్‌టీ సేవలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

- ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో గురువారం నుంచి ఈఎన్‌టీ సేవలు మొదలయ్యాయి. అరుదైన ఎండోస్కోపిక్ సైనస్ శస్త్రచికిత్సను ఇల్లెందు పట్టణం స్టేషన్‌బస్తీకి అబ్దుల్ కలీంకు.. ఈఎన్‌టీ వైద్య నిపుణులు, డీసీహెచ్ఎస్ డా.రవిబాబు, వైద్యురాలు డా.రవి తేజస్వి, కృష్ణవేణి, సిబ్బందితో కూడిన బృందం విజయవంతంగా నిర్వహించింది. సదరు రోగి గత 12 ఏళ్లుగా సైనస్ (ముక్కుదిబ్బడ) సమస్యతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాడు. తరచూ తలనొప్పితో బాధపడుతున్నాడు. జిల్లాలోని ఇతర ప్రభుత్వ వైద్యశాలల్లో ఎక్కడా లేని ఈఎన్‌టీ వైద్య పరికరాలను సీహెచ్‌సీకి గెయిల్ (గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా) సహకారంతో సమకూర్చారు.

ఈఎన్‌టీ సేవలు విజయవంతంగా ప్రారంభం



శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు డా.రవిబాబు, రవితేజస్వి, కృష్ణవేణి

✦ ఎండోస్కోపిక్ సైనస్ వంటి అరుదైన చికిత్సను ఇల్లెందులో నిర్వహించడంపై డీసీహెచ్ఎస్, వైద్యులను ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర టీవీవీపీ కమిషనర్ డా.అజయ్‌కుమార్, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌లు అభినందనలు తెలిపినట్టు వైద్యశాల సూపరింటెండెంట్ డా.జి.హర్షవర్ధన్ తెలిపారు. రోగులు ఎవరైనా ప్రైవేటు వైద్యంతో ఆర్థిక భారాన్ని మోయొద్దని, ఈఎన్‌టీ సమస్యలుంటే సీహెచ్‌సీని సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

కళాశాల మరమ్మతులకు ప్రతిపాదనలు

టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం మరమ్మతులకు తక్షణమే నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కళాశాలను గురువారం ఎమ్మెల్యే సందర్శించారు. సిబ్బంది, తరగతి గదులను పరిశీలించారు. భవనం, ఫ్లోరింగ్ మరమ్మతులు, ఇతర సదుపాయాల కల్పనకు రూ.కోటితో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపల్ సులోచనారాణి, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

'కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం'

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా చట్టాలు చేసి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబీ ఆరోపించారు. సీపీఎం 21 పిట్ శాఖ మహాసభ గురువారం లాల్ మహ్మద్‌నగర్‌లో జరిగింది. నాయకులు ఐలమ్మ, సీపీఎం దిగ్గజం సీతారాం ఏచూరికి నివాళులర్పించారు.